సాక్షి
కుమురం భీం

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



అకాల వర్షం.. అపార నష్టం
కాగజ్‌గనర్ మండలంలో కురిసిన అకాల వర్షం భారీ నష్టాన్ని మిగిల్చింది. గాలిదుమారంతో ఇంటి పైకప్పులు ఎగిరిపోగా పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. IIలో▸



బిగపట్టాల్సిందే..!
ఆశ్రమ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు కానరావడం లేదు. ఏళ్లుగా సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థినులు పడే అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. IIIలో▸

గరిష్టం/కనిష్టం
35.8/23.1

వాతావరణం
పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మబ్బులతో వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులు, వడగండ్ల వాన పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సంస్కృతి, సంప్రదాయాలతోనే ఆదివాసీలకు మనుగడ



పల్లకి మోస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నార్నూర్/కెరమెరి: ఆదివాసీ గిరిజనుల మనుగడ సంస్కృతి సంప్రదాయాలతోనే ముడిపడి ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. సిర్పూర్(యూ) మండలం రాఘపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మత్తెల అవ్వాల్ దేవస్థాన ఉత్సవాల్లో పాల్గొన్నారు. దేవతల పల్లకి మోసి, మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి, వ్యవసాయ, వ్యాపార పరంగా ఆదివాసీలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. సమాజంలో మార్పులు వచ్చినా తరతరాలుగా వస్తోన్న సంప్రదాయాలు, వేష భాషాలను మర్చిపోవద్దన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. గిరిజన గ్రామాలకు సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ యాదవ్‌రావు, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, సర్పంచ్ భాగ్యశ్రీ, పెందూర్ అర్జున్, మాడవి భీంరావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, నాయకులు జాడి రవీందర్, తొడసం శ్రీను పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఆసిఫాబాద్‌అర్బన్: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించే టీజీ సెట్- 23కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పరీక్ష ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ కేంద్రంలో 336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు https://tgcet.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పార్లమెంటరీ కోర్‌కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు



సమావేశంలో పాల్గొన్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ పార్లమెంటరీ కోర్ కమిటీ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర కార్యాచరణపై చర్చించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, జాయింట్ కన్వీనర్ కిరణ్, నాయకులు విస్తారక్ రవి పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి



సర్టిఫికెట్ అందిస్తున్న సేవా అధ్యక్షురాలు, జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): నిరుద్యోగ మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలని సింగరేణి సేవా సమితి బెల్లంపల్లి ఏరియా అధ్యక్షురాలు స్వరూపారాణి, ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గతేడాది సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం జీఎం కార్యాలయంలో సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల కుటుంబాల్లోని నిరుద్యోగ మహిళలు, యువత, పరిసర ప్రాంతాల మహిళలకు పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సింగరేణి సేవా సమితి స్వయం ఉపాధి శిక్షణలు అందిస్తుందన్నారు. ఈ ఏడాది మరిన్ని కొత్త కోర్సుల్లో శిక్షణనందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నైపుణ్యం ఉన్న మహిళలు సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. భూనిర్వాసిత ప్రాంతాల్లోని మహిళలు, యువకులకు శిక్షణ అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, ప్రసాదిని, పద్మ, సీనియర్ సేవా సభ్యులు శంకరమ్మ, శిక్షకులు కల్పన, రూప, సౌజన్య, శారద, ఝాన్సీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కాగజ్‌నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఘనంగా రంజాన్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు శనివారం ఉదయం పట్టణంలోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం మత పెద్ద ఖురాన్ సందేశం చదివి వినిపించారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ గణేశ్ రాథోడ్, గుండ శ్యాం ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



ముస్లిం ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

- ఏప్రిల్‌లో తగ్గిన ఆర్టీసీ ఆదాయం
- పెళ్లిళ్లకు ముహూర్తాలు లేక, పరీక్షలతో రెవెన్యూకు గండి
- నెలకు సగటున రూ.47లక్షల నష్టం
- సోమవారం నుంచి బీజాపూర్‌కు కొత్త సర్వీస్ ప్రారంభించే యోచన

నష్టాల బాటలోనే..!



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో

ఆసిఫాబాద్: ఆర్టీసీ ఆదాయంపై ఎండ దెబ్బ పడింది. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో నష్టాల బాటలో నడుస్తోంది. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నా రెవెన్యూ మెరుగుపడటం లేదు. రెండేళ్ల క్రితం కోవిడ్ ప్రభావంతో లాక్‌డౌన్ కారణంగా ఆర్టీసీ తీవ్ర నష్టాల పాలైంది. బస్సుల నిర్వహణ సైతం భారంగా మారింది. లాక్‌డౌన్ తర్వాత కొత్త ఆదాయ మార్గాలతో సంస్థ మెల్లమెల్లగా కోలుకుంది. ఆదాయమే లక్ష్యంగా నష్టాలను అధిగమించేందుకు డీజిల్ సెస్ పేరుతో ప్రయాణికులపై చార్జీల భారం మోపారు. గతేడాది పెంచిన సెస్‌ను కొనసాగిస్తూనే రెండోసారి అదనపు సెస్ విధించారు. ఇటీవల టోల్ చార్జీలు కూడా ప్రయాణికులే భరిస్తున్నారు. వీటితో పాటు విద్యార్థుల నెలసరి పాస్ చార్జీలు సైతం పెంచారు. ఈ క్రమంలో ఆర్టీసీ కొంత వరకు పుంజుకుంటున్నా నష్టాలను పూడ్చుకోవడం సాధ్యం కావడం లేదు.

డిపోలో 81 బస్సులు

నిజాం కాలంలో ప్రారంభించిన తొలి మూడు డిపోల్లో ఆసిఫాబాద్ ఒకటి. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ డిపో ప్రారంభంలో లాభాల్లో ఉన్నా ప్రస్తుతం నష్టాల బాటలో నడుస్తోంది. కాలం చెల్లిన బస్సులతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, ఇటీవల డిపోకు కొత్త బస్సులు వచ్చాయి. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో 383 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో డీఎం, అసిస్టెంట్ డీఎం, 124 మంది కండక్టర్లు, 136 మంది డ్రైవర్లు ఇతర సిబ్బంది ఉన్నారు. డిపోలో 81 బస్సు సర్వీసులు ఉండగా, వీటిలో రాజధాని 2, సూపర్ లగ్జరీలు 12, డీలక్స్‌లు 7, ఆర్డీనరీలు 25, ఎక్స్‌ప్రెస్‌లు 04, ప్రైవేటు అద్దె బస్సులు 31 ఉన్నాయి. ప్రతిరోజూ డిపో నుంచి 75 షెడ్యూళ్లు, 22 రూట్లతో 31 వేల కిలోమీటర్లు బస్సులు నడుపుతుండగా, 15 వేల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రూట్లలో బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. సోమవారం నుంచి చత్తీస్‌గఢ్ బీజాపూర్‌కు కొత్త సర్వీస్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గత నెలలో రూ.30 లక్షల నష్టం

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు రోజుకు రూ.14.5 లక్షల ఆదాయం లక్ష్యంగా ఉంది. లాక్‌డౌన్‌కు ముందు రోజుకు రూ.12 లక్షల ఆదాయం సమకూరేది. రోజుకు 33 వేల కిలోమీటర్లు తిరగాల్సిన బస్సులు ప్రస్తుతం 31 వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో డిపోకు ఆదాయం రూ.4,12,08,000 రాగా, సగటున రోజుకు రూ.13.5 లక్షల ఆదాయం సమకూరింది. ఏప్రిల్‌లో శుభకార్యాలు లేకపోవడం, విద్యార్థులకు పరీక్షలు ఉండడంతో కొంత ఆదాయం తగ్గింది. ఈ నెలలో ఇప్పటి వరకు రూ.2,50,73,000 రెవెన్యూ రాగా, రోజుకు సగటున రూ.12 లక్షలు సమకూరుతోంది. ఏడాదిలో సగటున ప్రతినెలా రూ.47 లక్షల నష్టం వాటిల్లుతుండగా, గత నెలలో డిపోకు రూ.30 లక్షల నష్టం వాటిల్లింది. ఏప్రిల్‌లో ఆదాయం తగ్గడంతో డిపో మరింత నష్టాల్లోకి వెళ్లింది. సంస్థను కాపాడుకునేందుకు కార్గో సేవలు సైతం ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించే కార్గో సర్వీసుల ద్వారా దూర ప్రాంతాలకు సేవలందించనున్నారు. వీటి ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం వస్తోంది. కాగా ఆర్టీసీ పెట్రోల్ బంకు లాభాల్లో నడుస్తోంది.

బస్సుల రద్దుతో ఇబ్బందులు

కొన్నేళ్లుగా నడిపే రెగ్యులర్ సర్వీసులతోపాటు పుణ్యక్షేత్రాలకు వెళ్లే సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసిఫాబాద్ నుంచి వరంగల్, నిజామాబాద్, వేములవాడ, కొండగట్టు, బాసర, భద్రాచలం, షిర్డీ, నాగపూర్‌లకు సర్వీసులను రద్దు చేశారు. పుణ్యక్షేత్రాలకు బస్సులు లేకపోవడంతో జిల్లా వాసులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్‌కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 7 వరకు బస్సులు లేవు. ఆసిఫాబాద్- మంచిర్యాలకు వయా బెల్లంపల్లి సుమారు 2.30 గంటలు ప్రయాణించాల్సి వస్తోంది. సాయంత్రం పూట మంచిర్యాల బస్టాండ్‌లో ఆసిఫాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు అధికంగా ఉంటున్నా రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయడం లేదు. ఎక్స్‌ప్రెస్‌ల కొరతతో దూర ప్రాంతాలకు వెళ్లే వారు పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో ఏప్రిల్‌లో ఆదాయం తగ్గిందని, త్వరలో పుంజుకుంటుందని డీఎం శ్రీధర్ వెల్లడించారు.

సెల్‌వుల్లో ఆటలేనా..!

సండే స్పెషల్

- పిల్లల్లో పెరిగిన మొబైల్ వీక్షణం
- రోజుకు సగటున మూడు గంటలపైనే..
- క్రీడల్లో శిక్షణ వైపు దృష్టి మళ్లిస్తే మేలు

సాక్షి, మంచిర్యాల డెస్క్: వేసవి సెలవులు వస్తున్నాయంటే చాలు పిల్లల్లో ఎక్కడా లేని సంబరం. అదే సమయంలో తల్లిదండ్రుల్లో ఓ వైపు ఆనందం.. మరోవైపు ఆందోళన. ఏడాదంతా తీరిక లేకుండా చదివిన పిల్లలకు కాస్త తీరిక దొరికిందని ఆనందమైతే.. సెలవుల్లో మొబైల్ ఫోన్ అతిగా వాడడం, అల్లరి చేష్టలతో ఎక్కడ ప్రాణాల మీదికి తెచ్చుకుంటా రోననేది ఆందోళనకు కారణం. 69శాతం మంది పిల్లలు రోజులో సగటున మూడు గంటల కంటే ఎక్కువగా సమయాన్ని మొబైల్ ఫోన్ వీక్షించడానికే కేటాయిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. 96శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్ వైపు ఆకర్షితులు కాకుండా ఉండడానికి ఏం చేయాలో తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారని సర్వే వెల్లడించింది. గతంలో విహార యాత్రలకు వెళ్లడం, అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లడం చేసేవారు. కానీ ప్రస్తుతం అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లే వారి సంఖ్య చాలావరకు తగ్గింది. పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తే మేలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య

జిల్లాలు	1నుంచి 10వ తరగతి వరకు	ఇంటర్ విద్యార్థులు
ఆదిలాబాద్	1,39,421	19,396
మంచిర్యాల	1,16,250	14,668
నిర్మల్	52,667	6,621
కుమురంభీం	90,168	9,933

నియంత్రణ సాధ్యమే..

తల్లిదండ్రులు పిల్లలపై కాస్త దృష్టి సారిస్తే మొబైల్‌ఫోన్ వినియోగం నియంత్రణ సాధ్యమే. స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఫోన్లలో పెరెంటల్ కంట్రోల్ అనే ఆప్షన్‌లో అందుబాటులోకి తెచ్చాయి. సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫోన్ వినియోగ సమయాన్ని నిర్ధారించుకోవాలి. ప్లేస్టోర్‌లోనూ పలు ఆప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఏయే ఆప్‌లు ఎంత ఉపయోగిస్తున్నారు.. ఎంత సమయం ఉపయోగించుకోవాలి అనే సమయాన్ని సూచించుకోవచ్చు.

పెరిగిన వినియోగం

కరోనా కారణంగా ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడంతో పిల్లల్లో చాలామందికి మొబైల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు, జీవనోపాధి నిమిత్తం పనులకు వెళ్లిన సందర్భంలో క్షేమ సమాచారం కోసం సెల్‌ఫోన్లను అందుబాటులో ఉంచుతున్నారు. కారణమేదైనప్పటికీ విద్యార్థుల్లో చాలామందికి సొంతంగా ఫోన్ ఉంటోంది. పదేళ్లలోపు పిల్లల్లో 42శాతం మంది, 12ఏళ్లలోపు పిల్లలు 71శాతం మంది, 14ఏళ్లలోపు వారు 91శాతం మంది వ్యక్తిగత మొబైల్ ఫోన్లను కలిగి ఉన్నారు. దీంతో సెల్‌ఫోన్లలో ఆటలు ఆడేస్తూ.. రీల్స్ చూసేస్తూ.. సామాజిక మాధ్యమాల్లో కాలం గడిపేస్తున్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలు

విద్యార్థులకు వివిధ ఆటలపై ఉచితంగా శిక్షణ అందించేందుకు జిల్లా యువజన క్రీడల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. మే ఒకటి నుంచి 31వరకు ఆయా ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఫుట్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, తైక్వాండో, చెస్, ఉష్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. మంచిర్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పది, పట్టణ ప్రాంతాల్లో పది శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. కుమురంభీం జిల్లాలో పది, నిర్మల్ జిల్లా కేంద్రంలో 6, భైంసాలో 4, ఖానాపూర్‌లో 3, నిర్మల్ నియోజకవర్గం గ్రామీణ ప్రాంతాల్లో 43, ముథోల్‌లో 42, ఖానాపూర్‌లో 17, ఆదిలాబాద్ జిల్లాలో పది క్రీడాశిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి



పిల్లల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించాలనే ఉద్దేశంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. క్రీడా శిక్షణ శిబిరాలను ఉత్సాహవంతులైన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. క్రీడల్లో మెలకువలు నేర్చుకుని, నైపుణ్యాలను మెరుగుపర్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదిగేలా శిక్షకులకు సూచనలు అందజేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడల అధికారి, ఆదిలాబాద్


మానసిక ఎదుగుదల లోపిస్తుంది..



పిల్లలు సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడడం వల్ల మానసిక ఎదుగుదల లోపిస్తుంది. చలాకీతనం తగ్గుతుంది. కంటి సమస్యలు, మెడలో కండరాల బలహీనత ఏర్పడుతుంది. పాత కాలంలో ఆడే ఆటలు ఇప్పటి పిల్లలు ఆడడం లేదు. తల్లిదండ్రులు పిల్లలను ఇండోర్, ఔట్‌డోర్ గేములు ఆడే విధంగా చూడాలి. బంధువుల ఇంటికి వెళ్లకపోవడంతో సమాజ సంబంధాలు తగ్గుతున్నాయి. వేసవి కాలంలో పిల్లలను పిక్నిక్‌లు, వినోదాలకు తీసుకెళ్లడం వల్ల వారిలో ప్రశాంతత నెలకొంటుంది. అవసరమైతే తప్ప పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకూడదు. ఎక్కువ సేపు ఫోన్లు చూడడం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గుతుంది. తల్లిదండ్రులు ఈ విషయంలో ఆలోచించడం మంచిది.

– క్షౌం వెంకట్‌రెడ్డి, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆదిలాబాద్

స్మార్ట్‌గా అనారోగ్య సమస్యలు



సెల్‌ఫోన్ అనేది నిత్యావసర వస్తువుగా మారిపోయింది. అతిగా సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న పిల్లాడి నుంచి ముదుసలి వరకు సెల్‌ఫోన్ తప్పనిసరి. చిన్నపిల్లల్లో కంటి చూపు మీద ఎక్కువగా ప్రభావం చూపుతుంది. స్మార్ట్‌ఫోన్ అలవాటుతో పిల్లలకు ఏమీ తోచదు. స్మార్ట్ ఫోన్ తెర నుంచి వచ్చే నీలిరంగు లైటు పిల్లల కంటి చూపుపై ప్రభావం చూపుతుంది. దాంతో చిన్నప్పుడే ఐసైట్ సమస్య వచ్చి కళ్ల జోడు పెట్టుకోవాల్సి వస్తుంది. వినికిడి లోపానికి అవకాశం ఉంది. నిద్రలేమి సమస్య రావచ్చు. జ్ఞాపకశక్తిపై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. తలనొప్పి, బ్యాక్‌పెయిన్ సమస్యలు తలెత్తుతాయి. పిల్లల చేతికి ఎటువంటి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ ఇవ్వొద్దు. మెదడు ఎదుగుదలను దెబ్బతీసి, వర్చువల్ ఆటిజంను కలిగిస్తుంది. చికాకు, అసహనం, కోపం, తిరుగుబాటు ధోరణి పెరుగుతుంది. సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లి వేలల్లో ఖర్చు చేసినా ఒక్కోసారి ఫలితం దక్కకపోవచ్చు.

– డాక్టర్ సునీల్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

పిల్లలపై తీవ్ర ప్రభావం



సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తే పెద్దవాళ్లపైనే ప్రభావం చూపుతుంది. అలాంటిది చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల చేతుల్లో గంటల పాటు ఫోన్ పెట్టేస్తున్నారు. అలా చూడడం వల్ల పిల్లల మెదడుపై రేడియేషన్ ప్రభావం పడుతుంది. కంటితోపాటు వెన్ను సమస్యలు వస్తాయి. మొబైల్‌లో ఒక్కోసారి వివిధ సైట్లు, వీడియోలు చూడడం వల్ల పిల్లలపై మానసికంగానూ ప్రభావం పడుతుంది. తల్లిదండ్రులు సాధ్యమైనంత వరకు పిల్లలను ఫోన్ నుంచి దూరం చేయాలి.

– డాక్టర్ నాళం స్వప్న, చిన్నపిల్లల వైద్యురాలు, నిర్మల్

క్లుప్తంగా

ప్రాజెక్టు కాలువలో పడిన చుక్కల దుప్పి



చుక్కల దుప్పితో ఫారెస్టు అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని కుమురంభీం ప్రాజెక్టు ప్రధాన కాలువలో శనివారం నీళ్లు తాగేందుకు వెళ్లిన చుక్కలదుప్పి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయింది. గమనించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు స్థానికుల సాయంతో దుప్పిని రక్షించి అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు ఎఫ్ఎస్వో లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు బండు, మహిపాల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న 108 సిబ్బంది



నగదు, సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న 108 సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఏసీసీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు పోగొట్టుకున్న పర్సు, రెండు సెల్‌ఫోన్లను అప్పగించి 108 సిబ్బంది నిజాయతీ చాటుకున్నారు. తాండూరు నుంచి మంచిర్యాలకు బైక్‌పై వస్తున్న వేముల రాంరెడ్డి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుని బ్యాగు అక్కడే పడిపోయింది. అందులో రూ. 28,370 నగదు, రెండు సెల్‌ఫోన్లు ఉన్నాయి. 108 సిబ్బంది వాటిని రాంరెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డికి అప్పగించారు. నిజాయతీ చాటుకున్న ఈఎంటీ మధుకర్, పైలట్ సతీష్‌లను పలువురు అభినందించారు.

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం

నస్పూర్(మంచిర్యాల): పట్టణ పరిధిలోని షిర్కే కాలనీలో ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం చెందినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. కాలనీకి చెందిన పడాల రాజు(42) శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలంగా ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. శనివారం సీతారాంపల్లి గోదావరినది వద్ద ఓ కట్టడానికి ఉన్న పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

వాంకిడి: మండలంలోని బెండార గ్రామానికి చెందిన ఇగురుపు హరిబాబు (20) ఇంటర్ చదివాడు. సెకండయర్‌లో ఫెయిల్ కావడంతో ఇటీవల మళ్లీ పరీక్ష రాశాడు. ఈ నెల 19న భూపాలపల్లికి వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. అదేరోజు రాత్రి 12 గంటల తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు వచ్చింది. తెలిసిన వారి వద్ద ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి ఇగురపు నానయ్య శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.



సీతానగర్‌లో కూలిన ఇంటిగోడ



విద్యుత్ స్తంభం పడటంతో ధ్వంసమైన ఆటో

అకాల వర్షం.. అపార నష్టం

కాగజ్‌నగర్‌రూరల్/తిర్యాణి: కాగజ్‌నగర్ మండలంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం భారీ నష్టాన్ని మిగిల్చింది. రాస్పెల్లి, గజ్జిగూడ, జంబుగ, సీతానగర్, నామనగర్, నాగంపేట, మోసం, ఆరెగూడ గ్రామాల్లో గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. గాలి తీవ్రతకు పలువురి ఇంటి పైకప్పులు ఎగిరిపోగా పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఈజ్‌గాం నుంచి జంబుగ విద్యుత్ ఉపకేంద్రానికి వచ్చే ప్రధాన విద్యుత్ లైన్‌కు సంబంధించిన సుమారు 15 స్తంభాలు నేలమట్టం కావడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గజ్జిగూడలో గాలికి ఎగిరివచ్చిన రేకులు తగిలి గజ్జి సత్తయ్యకు చెందిన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మోసం గ్రామంలో రోడ్డుపై నిలిపి ఉన్న ఆటోపై విద్యుత్ స్తంభం విరిగిపడడంతో ఆటో దెబ్బతింది. రాస్పెల్లి, గజ్జిగూడ గ్రామాల్లో రైతులు ఇంటి ఆవరణలో నిల్వ చేసుకున్న పత్తి పంట గాలివానకు కొట్టుకుపోయింది. కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై సీతానగర్ వద్ద భారీ వృక్షం నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గజ్జిగూడ, మోసం, నాగంపేటలో మామిడి కాయలు నేలరాలాయి. తిర్యాణి, కౌటాల, దహెగాం మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ రహదారిపై నేలకొరిగిన చెట్టు



తిర్యాణిలో...



రేకులు తగిలి మృతి చెందిన ఆవు

కూచిపూడి కళాకారులకు నంది పురస్కారం



పురస్కారాలు అందుకున్న కళాకారులు

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లో శివశక్తి కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ నృత్యోత్సవంలో పాల్గొన్న మంచిర్యాలకు చెందిన పదకొండు మంది కూచిపూడి కళాకారులు నంది పురస్కారం అందుకున్నారు. మరో ఐదుగురికి మయూర నర్తకి పురస్కారం అందజేసినట్లు స్నేహ ఫౌండేషన్ నిర్వాహకురాలు చిదానందకుమారి తెలిపారు.

దొంగ నంబర్ ప్లేట్ కారు యజమానులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దొంగ నంబర్ ప్లేట్‌తో కారు నడుపుతున్న యజమానులపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరికి చెందిన గౌరు కార్తీక్ మారుతి షిఫ్ట్ వాహనం (టీఎస్01ఈఎం2828) ఉంది. శనివారం ఇంట్లో తన కారును ఉంచి ఆదిలాబాద్ పట్టణానికి వచ్చాడు. జామ మసీదు వద్ద తన కారు నంబర్‌తో ఉన్న వాహనం కనిపించడంతో కుటుంబీకులకు ఫోన్ చేశాడు. కుటుంబీకులు వాహనం ఇంటి వద్దే ఉందని తెలిపారు. దీంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన నాందేవ్, భూమేశ్‌లు ఈ వాహనానికి యజమానులు కాగా ఈ వాహనం (టీఎస్01యూసీ1863) పై ఫైనాన్స్ ఉండడంతో దొంగనంబర్‌తో తిరుగుతున్నారు. వీరిద్దరిపై పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు రైతు బలి

- వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు
- తోటకు కాపలా వెళ్తుండగా ఘటన
- సంఘటన స్థలంలోనే రైతు మృత్యువాత
- నగం వరకు కాలిపోయిన శరీరం



రాజన్న(ఫైల్)

భీమారం: వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి దాసరి రాజన్న (42) మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని ఆరెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. శ్రీరాంపూర్ సీఐ బి.రాజు వివరాల ప్రకారం... ఆరెపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజన్న పంట పొలం వద్ద రాత్రివేళ కాపలా ఉండేందుకు కాలినడకన బయలుదేరాడు. అర్ష చంద్రయ్య కౌలుకు తీసుకున్న పొలం వద్ద 11కేవీ విద్యుత్ లైనుకు అమర్చిన విద్యుత్ తీగలు తగలడంతో రాజన్న సగానికి పైగా కాలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే రోడ్డుపైకి తీసుకురాగా అప్పటికే మృతిచెందాడు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు



రాజన్న మృతదేహం

ఆరెపల్లిలో అడవి జంతువుల కోసం అమర్చిన తీగలను శనివారం శ్రీరాంపూర్ సీఐ బి.రాజు, ఎస్సై గట్ల సుధాకర్ పరిశీలించారు. కాగా రాజన్న భార్య రజిత ఫిర్యాదు మేరకు విద్యుత్ వల ఏర్పాటు చేసి రాజన్న మృతికి కారణమైన అదే గ్రామానికి చెందిన అర్ష లస్మయ్య, గావిడి రాజయ్యలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మామిడితోటకు కాపలా వెళ్తూ...

గ్రామ సమీపంలోని మామిడితోటకి కాపలా వెళ్తున్నానని చెప్పివెళ్లిన రాజన్న కొంత సేపటికే మృతిచెందిన వార్త విని కుటుంబీకులు బోరున విలపించారు. రాజన్న మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

25న ధర్నా విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సమ్మయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ఈ నెల 25న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య కోరారు. శనివారం నస్పూర్‌కాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, ప్రతీ కార్మికునికి సీఎంపీఎఫ్ అమలు చేయాలని, రక్షణ పరికరాలు అందించాలని, ప్రతీ నెల 10లోగా వేతనాలు బ్యాంకుల ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి డీ.రవిందర్, నాయకులు వీరేశం, ప్రభాకర్, నర్సింగరావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మూసివేత గనుల్లో సామగ్రి భద్రమేనా?



మందమర్రి ఏరియాలోని కేకే-1 గని ముఖద్వారం

- 60 సంవత్సరాలు ఉపాధి కల్పించిన కేకే-1 గని
- మరో మూడు నెలలపాటు బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని మూసివేత గనుల్లో సామగ్రి భద్రంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మందమర్రి ఏరియాలో గతేడాది ఆర్కే-1ఏ గని మూసివేతకు గురికాగా ఈ ఏడాది మరో మూడునెలల్లో కేకే-1 గని మూతపడనుంది. బొగ్గు నిలువలు నిండిపోవడంతో మరో మూడు నెలల వరకు మాత్రమే ఉత్పత్తి అందించే అవకాశం ఉంది. కేకే-1 గని సుమారు అరవై మూడేళ్లు కార్మికులకు ఉపాధి కల్పించింది. ఈ ఏడాది సంస్థ బొగ్గు ఉత్పత్తి ఉత్పత్తి లక్ష్యాన్ని నెలకు 10 వేల టన్నుల చొప్పున అంటే మూడు నెలలకు 10 వేల టన్నుల టార్గెట్ నిర్దేశించింది. గనిలో బొగ్గు నిలువలు పూర్తికాగానే అందులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఏరియాలోని మిగతా గనుల్లో భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గనుల్లో వినియోగించిన విలువైన సామగ్రిని అధికారులను మచ్చిక చేసుకున్న పలువురు ఆలయాల నిర్మాణం, యూనియన్ కార్యాలయాలు, తదితర అవసరాలకు తీసుకెళ్లడం, గుర్తు తెలియని దుండగులు సెక్యూరిటీ కళ్లుగప్పి అపహరించడం పరిపాటి. సామగ్రి దొంగలపాలు కాకుండా చూడాలని కోరుతున్నారు.

సామగ్రి భద్రమేనా?

మందమర్రి ఏరియాలోని కేకే-1, ఆర్కే 1ఏ గనుల ఆవరణలో ఉద్యోగుల మౌలిక సౌకర్యాల కోసమే కాకుండా విధి నిర్వహణలోని అవసరాల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు, ఇతర పరికరాలు ఫర్నీచర్, గేట్లు, తదితర విలువైన వస్తువులు ఎంతవరకు భద్రమని పలువురు ప్రశ్నిస్తున్నారు. గనులు మూతబడుతున్నాయని తెలియడంతో కొంత మంది అధికారులతో కుమ్మక్కై సామగ్రిని సొంత అవసరాల కోసం తీసుకెళ్లడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇటీవల ఓ గని నుంచి ఓ యూనియన్ ప్రతినిధి పోచమ్మ టెంపుల్ కోసమని 10 ఐరన్ పైపులను ఇండెంట్ రాయించుకుని నల్లబై పైపులు తీసుకెళ్తుండగా ఎస్ఎండీసీ సిబ్బంది అడ్డుకుని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విలువైన సామగ్రిని సంస్థ అవసరాలకే వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



ఏరియాలో సెక్యూరిటీ విభాగం అప్రమత్తతతో విధులు నిర్వహిస్తోంది. అధికారులు ఇచ్చే ఇండెంట్ చిట్టి పరిశీలించిన తర్వాతే సామగ్రి పంపిస్తున్నాం. ఏరియాలోని కేకే 1, ఆర్కే1ఏ గనుల్లోని అవసరమైన సామగ్రిని ఇతర గనులకు, అవసరంలేని సామగ్రిని ఏరియా స్టోర్స్‌కి తరలిస్తాం.

– నగునూరి రవి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్

మహిళను బెదిరించి బంగారం అపహరణ

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని గోపాల్‌నగర్‌లో గుర్తు తెలియని దుండగులు శనివారం ఓ ఇంట్లోకి చొరబడి పది తులాల బంగారం అపహరించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... అచ్చులాపూర్, రేచినీ క్రాస్‌రోడ్ మూల మలుపు వద్ద బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి చౌదరి కుటుంబం నివాసం ఉంటోంది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇద్దరు యువకులు పథకం ప్రకారం ముఖానికి ముసుగేసుకుని ఇంట్లో చొరబడ్డారు. ఆసమయంలో చౌదరి భార్య పద్మజ మాత్రమే ఇంట్లో ఉంది. అగంతకులు ఆమెను కత్తితో బెదిరించి వొంటిపై ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు లాక్కున్నారు. బీరువా తాళాలు కూడా ఇవ్వాలని బెదిరించడంతో మహిళ కేకలు వేసింది. దీంతో దుండగులు పారిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సమ్మయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి జాగిలాలతో దొంగల ఆచూకీ కోసం వెతుకుతున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ జగదీశ్ సందర్శించారు. రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో కూడా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించి విఫలమైనట్లు సమాచారం. చోరీలకు పాల్పడుతోంది స్థానికుల లేదా ఇతర ప్రాంతాల వ్యక్తులా అనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జాగిలంతో పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
FLAT FOR SALE

■ LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 28కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3176]

WANTED

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 99596 17233, 88858704769. [M-1190681]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793416]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376. [H-797521]

■ పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్: 9440828190 [HA-6127]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్ ఆయాలు, భార్యా భర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-10733]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

మార్పుకోసం.. మరో అడుగు

- మహిళల కోసమే వనితా వాక్కు
- సంస్థను ఏర్పాటు చేసి ఏడాది
- బాలికలు, మహిళల్లో నైపుణ్యాల అభివృద్ధికి కృషి
- మహిళలే టీంగా మారి ఉచితంగా సేవలు
- నేటి నుంచే ఉచిత శిక్షణ ప్రారంభం



కర్రసాములో శిక్షణ పొందిన చిన్నారులు, మహిళలు

మంచిర్యాలటౌన్: ఆడపిల్లను పుట్టనిద్దాం.. బ్రతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం.. అనే ఒక మంచి ఆలోచనతో మార్పు దిశగా మరో అడుగు అంటూ వనితా వాక్కును న్యాయవాది అయిన రంగు వేణుకుమార్ మహిళలతో గతేడాది మే 9వ తేదీన ప్రారంభించారు. నేటి సమాజంలో పసిపిల్లలు, బాలికలు, మహిళలపై నిత్యం ఎన్నో రకాల అఘాయిత్యాలు, అమానుషాలు జరుగుతుంటే, ప్రభుత్వాలు చేసిన దిశ, నిర్భయ, ఫోక్సోయాక్ట్ వంటి చట్టాల ద్వారా నేరస్తులకు శిక్షలు పడుతున్నా, సమాజంలో మార్పు రావడంలేదని, ప్రతి ఆడబిడ్డల రక్షణ మనందరి బాధ్యత అనుకుని, ఇలాంటి అఘాయిత్యాలను నివారించాలనే ఆశయంగా ఈ వనితా వాక్కును ఏర్పాటు చేశారు. ఇందులో పలువురు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారస్తులు, గృహిణులు, సామాజిక స్పృహ కలిగిన మహిళలతో కలిసి ఒక మహిళా సైన్యంతో వనితా వాక్కును ఏర్పాటు చేసి, ఏడాది పూర్తికాకముందే మహిళలు, బాలికలకు సేవలను అందించడంలో దూసుకుపోతోంది.

చిన్ననాటి నుంచే రాటుదేలేలా...

ఆడపిల్లలను సుకుమారంగా పెంచడం కాకుండా, వారు చిన్ననాటి నుంచే మానసికంగా, శారీరకంగా, నైతికంగా ధృడంగా చేయాలని, విద్యతో పాటు, వారిలో మానసిక వికాసం, ప్రాథమిక న్యాయశాస్త్రం, యోగా, మెడిటేషన్, కరాటే, కర్రసాము, బాక్సింగ్ వంటి ఆత్మరక్షణ కోసం ఉపయోగపడే వాటిపై సమయం దొరికినప్పుడు శిక్షణ ఇచ్చేలా ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఇందులో భాగంగానే మహిళలు వనితా వాక్కు సంస్థ ద్వారా గత ఏడాదిగా పలు పాఠశాలల్లోని విద్యార్థినులకు, గత ఏడాది, ప్రస్తుత వేసవి సెలవుల్లోని సమ్మర్ క్యాంపులో కర్రసాము(సిలంబం) అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వారి సహకారంతో ఉచితంగా 150మంది ఆడపిల్లలు, మహిళలకు శిక్షణను అందించారు. బాల్య వివాహాలు చేయకుండా, బాలికల భ్రూణ హత్యలను నివారించేలా పలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో అశ్లీల దృశ్యాలు రద్దు చేసేలా పోరాటం చేయడం, మహిళలు, ఆడపిల్లలు వేధింపులకు గురైనప్పుడు వారికి తోడుగా నిలిచి పోరాటం చేయడం, మహిళా సాధికారత దిశగా మహిళలకు వివిధ రంగాల్లో స్వయం ఉపాధి శిక్షణ కోర్సులు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోంది.

నేటి నుంచి ఉచిత శిక్షణ

మంచిర్యాల పట్టణంలోని రెడ్డికాలనీలో గల సెవెన్‌హిల్స్ హైస్కూల్‌లో ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10:30గంటలకు వనితా వాక్కు ఫౌండేషన్, సిలంబం అసోసియేషన్ వారి సహకారంతో రెండు నెలలు ఉచితంగా ఆడపిల్లలు, మహిళలకు యోగా, మెడిటేషన్, కరాటే, కర్రసాము, మానసిక వికాస తరగతులు నిర్వహించనున్నారు. పరీక్షలు పూర్తి చేసుకుని వేసవి సెలవులు ప్రారంభం కానుండడంతో బాలికలకు ఉపయోగకరంగా ఉంటుందని, వివరాలకు 9440482586, 9949811872 నంబర్లలో సంప్రదించాలని సంస్థ సభ్యులు తెలిపారు.



నృత్యంలో శిక్షణ పొంది ప్రదర్శిస్తున్న బాలికలు, మహిళలు


బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే...



ఆడపిల్లలు, మహిళలపై జరిగే అఘాయిత్యాల నుంచి వారిని వారు రక్షించుకుని, స్వయంగా ఎదుర్కొనేలా వారిలో మార్పు దిశగా వనితా వాక్కు అడుగులు వేస్తోంది. ఏడాదిలోనే తాము ఎంతో మందికి వారిలోని ఆత్మస్థైర్యాన్ని నింపేలా ఉచితంగా శిక్షణ అందిస్తూ, వారిలో చైతన్యాన్ని తీసుకొస్తున్నాం. మాకు ఎంతో మంది మహిళలు, సామాజిక కార్యకర్తలు తోడుగా నిలవడంతో విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నాం. వనితావాక్కు ఆధ్వర్యంలో ఉచితంగా అందించే శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి.

– తాళ్లపల్లి కవిత, వనితా వాక్కు కోఆర్డినేటర్, మంచిర్యాల

మార్పు దిశగా అడుగులు



వనితా వాక్కు ఫౌండేషన్ ఏర్పాటు చేసి దాదాపుగా ఏడాది కావస్తుంది. ఇప్పటికే చాలా మంది చిన్నారులకు, మహిళలకు ఉచితంగా కరాటే, యోగా, మెడిటేషన్, కర్రసాము, మానసిక వికాస తరగతులను ఉచితంగా నిర్వహించాం. ఈ ఏడాది సమ్మర్ క్యాంపును 23వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నాం. ఆడపిల్లలు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కుర్మ సునీత, వనితా వాక్కు కోఆర్డినేటర్, మంచిర్యాల